మాటవరస

భమిడిపాటి కామేశ్వరరావు

౧. బస్తీరోడ్లు

బస్తీరోడ్డుకేసి చూస్తే జీవితం అంటే పెద్ద పోటీపందెం అనిపిస్తుంది. ఈ పందెంలో ఎవడిబాధ వాడిది అని తెలుస్తుంది. సకల మానవసమత్వం తెలిసి నమ్మినప్పటికీ, ప్రతీవాడూ మరోణ్ణి దిగదొక్కి ముందుకి తను పెందరాళే వెళ్లాలని చేసేప్రయత్నం ప్రత్యక్షం అవుతుంది. పెందరాళే వెళ్లాలంటే వేగం ఎక్కువుండాలి. ధనవ్యయం చేస్తేగాని వేగం సిద్ధించదు. అందుచేత ధనవంతుడు బయల్దేరి, అనవసరంగా, తాత్కాలికంగా తనంతట తను తనకి ఆరోపించుకున్న అధికారాన్ని ప్రపంచంమీద చలాయిస్తాడు. ఆ చలాయింపుకూడా మసం చూడచ్చు. మనిషిని తప్పుకోమని బళ్లవాళ్లు. అందులో రెండెడ్ల బండివాణ్ణి ఒంటెద్దుబండివాడు, వీళ్లిద్దర్నీ జట్కామనిషి, వీళ్లముగ్గుర్నీ రెండుగుఱ్ఱాల కోచివాళ్లు, వీళ్ల నలుగుర్నీ సైకిల్‌వాళ్లు. పాపం, రెండెడ్లబండివాడు మనుష్యుల్ని తప్ప మరెవర్నీ తప్పుకోమని తిట్టడానికి లేదనుకున్నాను. కాని, ఒకచోట ఒక రెండెడ్ల బండివాడు ముందున్న ఒకబండిని తప్పుకోమంటున్నాడు. తీరా ఏమిటా అని చూస్తే, ఆ ముందుది పోతులబండి. సరి, ఇది దాఖరు. వీడు మరి తప్పుకోమని తిట్టడానికి ఏవాహనం లేదనుకున్నాను. కాని, మరొకసందర్భంలో ఒకపోతులబండివాడు ముందున్న బండివాణ్ణి 'తప్పించు, కళ్లాపట్లా?' అని మోటుగా తిడుతున్నాడు. ఏంచెప్మా అని చూసేసరికి - ఆ ముందుబండికి కట్టింది ఒకయెద్దూ ఒక పోతూను! పెత్తనం ఇచ్చేదాతెవడేనా ఉండాలిగాని, పెత్తనం ఇచ్చి నెత్తిమెక్కించుకునేసరికి, పేనుకూడా తలంతా కొరికెయ్యగలదు. వీళ్లందరికీ పైవాడు సైకిలిస్టు. ఇతను నోరు విప్పకుండానే, గంట గిలగిలలాడించి అథార్టీ చేస్తాడు. వీళ్లందరికీ పై వాడు మోటారుసైకిల్‌గారు. ఆయన కేవలం జనం వగైరాల్ని హారెత్తగొట్టి డబడబలాడించి దారి పుచ్చుకుంటాడు. అతనిధోరణిలో కొంత లయ ఉందని గానశాస్త్రజ్ఞులు దెబ్బలాడితే ఆడచ్చుగాని, పామరులప్రాణానికి అది ప్రళయంగా ఉంటుంది. దుమ్మురేకొట్టడంలో అతడు ప్రథముడు. బస్సు వీరికి పైమాట. మహాబస్తీల్లో తప్ప కడంచోట్ల వీలయినంతమందికి నోట మట్టికొడితేగాని దానికి తోచదు. ఒక వ్యక్తితాలూకు స్వంత కారు వచ్చేసరికి వీరంతా దారివదలాలి. డ్రైవరు యొక్క ఔన్నత్యం, చక్రత్వం గమనించడానికి ప్రస్తుతం సావకాశం చాలదు. "బతకవురా! సావాలనుందా! నూకల్లేవురా! కళ్లు లేవురా! చెవ్వుడా! బుద్ధిలేదురా! యెదవా!" అనే మార్దవంగాఉండే మందలింపుల్తోనూ,

అవాచ్యాలైన మరి యితరమాటల్తోనూ, ఎంత గొప్పవాడైన పాదచార్డైనా సరే సాధారణంగా ఉత్తపుణ్యానికి డ్రైవర్లుకొందరు సరదాగా, అలవాటుచొప్పున హెచ్చరిస్తారు. అందుచేత ఎంతహడావిడీ అల్లరీచేసి, ఎంతదుమ్ము రేగకొడ్తే రోడ్డుమీద అంత గొప్పవాడు కదా అని మనికితెలుస్తుంది. ఒక స్వంతవ్యక్తిది కాకుండా, ఒక సంఘం తాలూకు కారైతే, ఆడ్రైవరికి భూమిమీద ఎవ్వరూ అడ్డు ఉండకుండా తప్పుగోవలిసిందే. కాని ఈశ్వరవేరు ఉండితీరుతుంది. రావణుడికి మైరావణు డుంటాడు. అల్లానే ఎంతకొమ్ముల్తిరిగిన కారుడ్రైవరుకీ కూడా అప్పీలుంది. గట్టిపదార్ధాలు చెప్పమంటే ఓ కుర్రాడు 'ఇనుము' అని చెప్పాడట. ఇంకా గట్టిది 'ఉక్కు' అని చెప్పాడట. ఇంకా గట్టిపదార్థం ఏది అని అడిగినప్పుడు 'దున్నపోతు' అన్నాట్ట. మేష్టరు, 'అదేమిరా, దున్నపోతా ఉక్కుకంటెగట్టి?' అని కోపపడ్డాట్ట. అప్పుడు కుర్రాడు, 'అవునండీ, ఉక్కుతో చేసిన కార్ని దున్నపోతు ఆపేస్తుందండీ' అన్నాట్ట. అల్లాగ్గా, దున్నపోతుగారుగాని, లేక వారి తాలూకు పట్టమహిషిగాని, ఎంత కారువారు ఎంత హోరుచేసినా లక్ష్యపెట్టక చెక్కుచెదరకుండా కార్ని ఖణాయించి ఆపేసి, అవలీలగా ప్రైజు పుచ్చుగుంటుంది. ఇక్కణ్ణించి మనం దుమ్ముఘట్టంలో ప్రవేశిస్తాం. అందుచేత, ప్రస్తుతం బస్తీరోడ్లమీద మనికి కనిపించే యితరదృశ్యాల్ని వొదిలేసెయ్యాలి. అవి ఏవి అనగా, సైడుకాలవలు: సైడుకాలవల్లో ఉన్నన్ని వర్ణభేధాలు ఎక్కడా లేవు. అవి ఓపక్కగా ఏకవండ్రా అంటే అల్లా ఏడవక, స్థితి పాడుచేసుగుని, రోడ్డుకి అడ్డంగా నడుస్తాయి భయభక్తుల్లేకుండా! వాటిలోనీరు: దానికి, రామరామ, బొత్తిగా సిగ్గు లేదు. పాతనీరు ఎండమంటే ఎండదు, ఆయిలు చిలికినా మండమంటే మండదు, పోనీ కంపులేకుండా ఉండమంటే ఉండదు. తననిగురించి అడ్డమైనవాడూ తలోమాటా అని తలో తిట్టూ తిడుతున్నారని అది లోపల్లోపల తెగి కుళ్లికుళ్లీపోతూంటుంది. 'నిజం దేవు డెరుగును, నీరు పల్లం ఎరుగును' అని శాస్త్రం. మనం నిజాన్నీ దేవుణ్ణీకూడా ఎరగం గనక, నిజం దేవు డెరుగు నని నమ్మితే నమ్మచ్చు. కాని ఈ సైడుకాలవలకేసి చూస్తే 'నీరు పల్లం ఎరుగుంటడం' సందేహించవలి సొస్తోంది. వాటిల్లో నీరు 'నీరు' అనే శబ్దానికికూడా అప్రతిష్ఠ తెస్తోంది, ప్రతిష్ఠతో ఉంటున్నా ననుకుని. దానికి పల్లం ఏవేపో తెలియకపోతేచస్తామా మరీ! పొద్దున్న తూర్పుకి వెళుతూంటుంది. మనం ఏదేనా పని చూసుగుని కాస్సేపట్లో చక్కావచ్చి మళ్లీ చూసేసరికి పడమటగా పోవాలని తంటాలు పడుతూంటుంది, దిక్కుమాలి తంటాలుపడడం ఇదీనూ! ఇవిగాక, పైపులు: అక్కడ స్నాన, పాన, క్షాళన, గ్రహణ, క్రీడ వగైరా ఉద్దేశాలతో అనేక జనం పోగవడం: ఒక్కొక్కప్పుడు కుంభ

మేలా: ఘటవాయిద్యం: మాతృభాషలో ఉపన్యాసపు పోటీలు: అక్కడే యుద్ధాలు–జిహ్వాస్త్రప్రయోగాలు. ఆ వైపులపక్క బస్సు జంతువులు: అనేకదూరం, శ్రమపడి, తొందరగా తిరిగిరావడంవల్ల అనేకరకాల మాలిన్యం పొట్టనెట్టుగుని స్వగ్రామం వేంచేసిన అంచీబస్సులు. వాటిని పరిశుభ్రంగా, పైచెప్పిన మాలిన్యం యావత్తూ అక్కడక్కడా పడిపోకుండా, మంచినీళ్లు తీసుగునే చోట పరిచి ఉంచితే, యథాశక్తిగా జనం ఆరగిస్తారు, ఎక్కడికక్కడికే ఆయిరి, అవి పైప్రపక్కనే, పల్లెటూరిచెర్లో గేదెల్ని కడిగినట్టు, ఈ బస్సుల్ని కడగడం. ఇంక రకరకాల కంపులూ; వాటికి ఆటపట్టులూ: వగైరా వగైరా ఉన్నాయి. అవన్నీ వొదిలి దుమ్ము గురించిమాత్రం కొంచెం ముక్కుపట్టుకుందాం.

దుమ్ము హైరోడ్డుమీద ఎక్కువ ఎత్తుగా లేస్తుంది. అల్లా పైకి లేచిపోడంలో దానికి దురుద్దేశం ఎంతమాత్రం లేదు. సరిగదా, దానిగో లంతా ఏమని అంటే, 'హైరోడ్డు' అనేదాల్లో 'హై' అనేది సార్థకం చెయ్యాలనే. అందుకనే కోచిబల్లమీద కూర్చుని, అశ్వాల్ని తోలేవాళ్లూ వాళ్లు కూడా 'హై' అనడం. పైగా ఆదుమ్ముని ఏంజెయ్యనున్నారు?

అల్పాలు ఎగిరిపడతారనిన్నీ, నీచస్థితిలోవాళ్లని కదిపితే, ఇల్లానే, కదపినవాడిమీదే కాకుండా దారేపోయేవాళ్ల నెత్తిమీదకూడా ఖైటాయిస్తారు అని కూడా ఋజువు చెయ్యాలని అది బయల్దేరింది. బస్తీ దుమ్ము బాగా మరిగి కొందరు పొడుం పీల్చడం మానేశారు. అందుకని నస్యవర్తకులు కొందరు పొడుంకొట్లు ఎత్తేసి, దాంతో ఐ.పి. పెట్టేశారు. కొందరూ, పొడుంచేసుగోడానికిగాని, కొట్టుదాకా వెళ్లడానికిగాని బద్ధకించినవాళ్లు, హైరోడ్డుమొగలో మూటలెట్టుగుని, గుక్కఅయిపోనిచ్చి, తమరి తాతగారి సొమ్ములాగ, ఒక్కొక్కపీలుపుకి మూడేసిగజాల దుమ్ము పీలుస్తూంటారు. ఎదోవిధంగా, సలుగురూ, జాతిమత వివక్షతలేకుండా, బస్తీ దుమ్ముమూలాన్ని ముక్కుమూసుగుని నడిచిపోతూ, (తిట్టుగోడానికే వీల్లేకుండా అంతకు ముందే నోరుమూసుగుని) సనాతన ధర్మం నిలబెడుతూ, యోగసాధన విషయంలో ప్రథమప్రయత్నాలు బలవంతం మీద చేస్తున్నారు. ఈ దుమ్మువల్ల ఉఫ్ అంటే ఎగిరిపోయే జనంకూడా కొంచెం గురుత్వం, భారీతనం సంపాదిస్తున్నారు. బస్తీదుమ్మువల్ల హైరోడ్డుపక్కల గోడలకి మందం పెరిగిపోడాన్ని చూసి, గోడలికికూడా పెరగడం ఉంటోంది గనక, చెట్లలాగ ఏదో ఒకరకం జీవం వీటికికూడా ఉండితీరాలని ఏ ధురంధరుడో కనిపెట్టకపోతాడా, అపూర్వ వ్యాసాలు ప్రకటించి పట్టాపుచ్చుగోకపోతాడా అని, కొన్ని పరిషత్తుల్లో తన్నిమిత్తం పట్టాలుచేయించి, మెరుగెట్టించి, 'రడీ'లో ఉంచారు. 'దుస్థితి' అంటే దుమ్ము

వల్ల కలిగేస్థితి అనేవిగ్రహం చెయించాలని కొందరు అన్నారు. సృష్టి, స్థితి, లయాలు దుమ్ములోనే నని మనికి బస్తీదుమ్మువల్లే తెలిసొస్తుంది. దుమ్ముకేసి చూస్తే, అన్నిందాలా మానవుణ్ణి తను కనిపెడుతూంటే, మానవుడు కనికరంలేకుండా తనని ఉపయోగించినందుకు, మరి ఓర్చుకోడం దుర్భరమై భూమి మానవుణ్ణి దుమ్మెత్తిపోస్తోందా అనిపిస్తుంది. ఇప్పటిదాకా కొందరు జనం 'కళ్లజోళ్ణి' పట్టుగుని 'ముక్కుద్దా'లనీ, 'ముక్కుజో'డనీ కూడా వాడేస్తున్నారు. ఇక అల్లాంటి వాళ్ల ఆటలు సాగవు. బస్తీదుమ్ము ధర్మమా అని ముక్కురాష్ట్రానికి ప్రత్యేకపుజోడు ఏర్పాటు కావచ్చు. కాళ్లకి రకరకాల జోళ్లు ఉన్నాయనీ (అంటే బంగారంవీ, వెండివీ, ఇనపవీ, కర్రవీ)—చేతులికి జోళ్లున్నాయనీ, కళ్లకి జోళ్లు సరే సరి అనీ,—చివరికి కర్మదశ చెవలకి గుడా జోళ్లుండడం ఏమిటి, మాకు లేకపోవడం ఏమిటి అని ముక్కు రంధ్రాలు చిరకాలం భగవంతుణ్ణిగురించి వాయుభక్షణమాత్రం చేస్తూ తపస్సుచేశాయిట. "క్రమేపీ చుట్టుపక్కలవాళ్లందరికీ రాష్ట్రాలు ఏర్పడనీండి. ఆ పని జరిగిపోయిం తరవాత మిగిలిపోయింది దానంతట అదే మన స్వంత రాష్ట్రంగా ఏర్పడుతుంది. ఇంకోర్ని అడగా అక్కర్లేదు, వాళ్లు ఇవ్వా అక్కర్లేదు, మనం దానం పట్టా అక్కర్లేదు." అని ఆంధ్ర జన వేదాంతుల్లాగ ఊరుకోక అవి తపస్సుచేసే సరికి, "మీకు తొలగిన అన్యాయం కారుయుగం రానీండి తొలగిస్తాను" అని ఆయన అన్నాట్ట. కారుయుగం అంటే కారేజి. అదే ఇంగ్లీషులో గారేజి అనిఅంటున్నారు—అరవ సాంప్రదాయంలో 'క' కారాలు 'గ' కారాలుగా మారతాయి గనక. ఎంత గొప్పవాళ్లైతే, పట్టపగలు అశేషజనానికీ, కళ్లల్లో దుమ్ముచల్లగలవా రంటారుగదా అని రోడ్డుమీదే తెలుస్తుంది. అటువంటప్పుడు, ఇక రాత్రివేళ అడిగారూ కథ! సాయంత్రం పడ్డ తరవాత కార్లు, ఇంటిముహం పట్టిన ఎడ్లలాగ మరీ జోరుగా నడుస్తాయి. ఎంచేతంటే, పగలైతే వినపడడం కోసం కుయ్యాలి. రాత్రి కనపడితే చాలు. వెలుగుయొక్క వేగం శబ్దంవేగానికి లక్షరెట్లు, మళ్లా మాట్లాడితే పది లక్షలరెట్లు. అందుకని రాత్రివేళ కారు చాలా దూరంలో ఉండగానే ఆధూళిమండలంలో కారుదీపోదయం అయి, మనికీ వచ్చే కారుకీ మధ్యనుండే జన జంతు శకటాదులు అన్నీ ధూళితెరమీద ఆడుతూన్న నవీన యుగపు తోలుబొమ్మల్లాగ, తెల్లకాగితం మీద సిరాబొమ్మల్లాగ మిక్కిలి శోభగా ఉంటాయి. అందరికీ ఏకరంగు ప్రసాదించడం వల్ల వర్ణభేదం నశించడానికిన్నీ, మధ్య జాగాలో ఉండే వీర్నీ వార్నీ కుడా ఏకకాలమందే అది తాకుతూఉండడంవల్ల అస్పృశ్యతా దోషానిన్నీ తొలగించడానికి బస్తీ దుమ్ముకిందామీదూ తెలియకుండాపనిచేస్తోందనిచెప్పచ్చు. బస్తీహైరోడ్డుమీద, రాత్రివేళ, జట్కాలో వెడుతూ, మాస్నేహితు డొకా

యన, — అతడు ప్రబంధకవిత్వం తప్ప మెచ్చడు — ‘స్మరశిలీముఖ కుసుమ కేసర పరాగధూళి’ — అనేది జ్ఞాపకం తెచ్చుగుని, అప్రస్తుతం అని తెలిసినా శ్రీనాథుణ్ణి పొగిడి, మెచ్చి అంతటితో ఆగక, ఆదుమ్ము మీద కవిత్వం యత్నించి, బస్తీ శృంగార వ్యవహార ప్రారంభోత్సవం సూచించడానికి బయల్దేరిన పుష్పబాణ విలాసఫలితం అన్నాడు. కొన్నిచోట్ల వీథిదీపాలు తామే చీకటికి భయపడి కళ్లు మూసుగున్నట్టు కనిపిస్తాయి. ఒక్కొక్కప్పుడు మూడు నాలుగు కార్లు ఇటూ అటూ ఒకేక్షణంలోనే వెళ్లడం గనక తటస్థిస్తే, వీథిదీపాలు ఎక్కడుంటాయో చెప్పగోడానికి ఇతరదీపాలు పట్రావాలి. ఏమైనా చెప్పడం గగనం. రాత్రిభాగంలో వెలుగుకిరణాలకి దుమ్మనేది ఒక వైభవం తేవడంవల్ల, వెలుగులూ అడ్డూ నీడలూ గమనించి, గ్రహణాల కారణాలూ, రకాలూ, ముక్కు మూసుగుని నేర్చుగోవచ్చునని భూగోళధూళిశాస్త్రప్రియులు చెబుతున్నారు. ధూళి లేనిపక్షానికి వర్షాలు నశించుతాయి గనక, ఇది మానవులకి అత్యంతోపయోగం అని కొందరిమతం.

౨. పదిరూపాయల టిక్కెట్టు

హద్దూ పద్దూ లేకుండా తిరగడాన్ని గురించి చెప్పేటప్పుడు తెలుగువాళ్లు, కాలుగాలినపిల్లిలా తిరగడం, మారని డబ్బులా తిరగడం, తడిమన్ను పొడిమన్ను అయేటట్టు తిరగడం, ఆసుకండిలా తిరగడం, అరువు సైకిల్‌లాగ తిరగడం అని అంటూంటారు. రైలు కంపెనీవారి ధర్మమా అని ఇటీవల ‘పదిరూపాయల టిక్కెట్టువాడులాగ తిరగడం’ అంటున్నారు. తిరగడానికి నియమించినకాలం వెనక నెల ఉండేది. ఇటీవల అది చిక్కి సగం అయింది. ఆ రోజుల్లో జనం కొత్తవార్ని కలుసుకోగానే, ‘ఎప్పుడు రావడం?’ అని హెచ్చరించి, ‘నేను ఈమధ్య పదిరూపాయలు’ అని అవతలవారు అనగానే, ఇంకా ఏం దస్తరం విప్పుతారోఅని, ‘అల్లానా? నాకు పనుంది సెలవు’ అని చెప్పేసి బలవంతపుసెలవు పుచ్చుగుని పోతూండడం జరిగింది. ఈ రీతిగా తెలుగుభాషలో చరితార్థులైనవాళ్లని అందర్నీ అభినందించవలసిందే. రైలువాళ్లు మంచిపని చేశారని కొందరన్నారు. తెలుగువాళ్ల ప్రథమావేశం, వేలంవెర్రీ, డబ్బుఖర్చు వేదాంతం ఎగసందోసి సొమ్ముచేసుకున్నారని కొందరన్నారు. “ఉన్నపన్లన్నీ దబ్బున చూసుగోవచ్చు, రండయ్యా!” అని రైలువాళ్లు పిలుస్తూంటే రాం అని పట్టుపట్టడం భావ్యంకాదని, పన్లున్నవాళ్లూ, పన్లు ఉన్నాయి అనుకున్నవాళ్లూ, పనిలేనివాళ్లూ, ఏదోపని ఏర్పాటు కాక పోతుందా అనుకున్నవాళ్లూ, ‘ముందు టిక్కెట్టు కొనేసి ఓమూల్నించి సర్క్యూటు ప్రారంభిస్తే ఏ ఊళ్లోదిగినా అక్కడ ఏ ఎరుగున్నవాడో, వాడులాంటివాడో దొరక్కపోతాడా, ఎక్కడో ఎల్లానో మకాం వెయ్యలేకపోతామా, కానీ! దేవుడున్నాడు!’ అను

కున్నవాళ్లూ, ఇంకా చాలామంది ఇతరులూ కూడా ఆ తరుణం ఉపయోగించుకున్నారు. టిక్కెట్టు పదిరూపాయలైనా, వందలకొద్దీ జనం చిన్న పెట్టిస్టేషన్లకిగూడా ఎగడి, వేలకొలది టిక్కెట్లు కొనుక్కోగా, రైలువారికొచ్చిన డబ్బు లక్షలమీదా, బయల్దేరి తిరిగినజనం సంకల్పించుగున్న పన్లు కోట్లమీదా, ఈజనమూ వీరియొక్క దర్శన, సమావేశ, పరిచయ, ఆతిథ్యభాగ్యం పొందగలిగిన ఇతరజనమూ పడినకష్టాలు శతకోట్లమీదా ఉంటాయని మా స్నేహితుడు ఒకాయన మదింపువేశాడు. వీరిలో చాలామందికి నెరవేరిన పన్లు లెక్కకి అందవు. కొందరికి పన్లు ఒకట్లమీద అయినాయి. కొందరికి ఒకటేపని నెరవేరింది—ఇంటికి చేరుకోడం—చాలామంది పని అయిపోయింది - కాలం అయిపోయి ఇల్లుచేరేసరికి. కొందరికి ౧౫ రోజులపాటు నిరుద్యోగసమస్య తెగిపోయింది. అందరికీ నిష్పక్షపాతంగా 'దశ' మారిపోయింది. రైలువారు జనానికి, ఇటువంటివే నూతనదశలు త్వరత్వరగా ఇప్పిస్తారనిన్నీ, వందరూపాయల టిక్కెట్టుమీద సంవత్సరమున్నూ, వెయ్యిరూపాయల టిక్కెట్టుమీద యావజ్జీవితమున్నూ తిరిగి పనులుచూసుకోవచ్చును అని అంటారనిన్నీ, అప్పుడు బ్రతికున్న తెలుగువాళ్లంతాకూడా రైళ్లెక్కి ఇటో అటో ఎటో తమకే తెలియని స్టేషన్లకి వెడుతూంటారనిన్నీ, అప్పుడు బస్తీల్లో దుమ్ము తగ్గి, కంపుపోయి, జనం ఉండరు గనక ఆరోగ్యం హెచ్చి, ఇళ్లుచౌకై ఇంకాబోలెడు సదుపాయాలు వాటంతట అవే సిద్ధిస్తాయనిన్నీ, ఎల్లానో అల్లా ఆ టైములోనే కొత్త ఎన్నికలు పడేటట్టుచేసి కొన్నికక్షులవారు ఒకటి మెజారిటీతో ఓనా నెగ్గాలని చూస్తున్నారనిన్నీ పామరులు అనుకుంటున్నారు. ఈరీతిగానే ౧౦౨౦ రూపాయలకి ఓడమీద భూలోకయాత్రా టిక్కెట్టున్నూ, మరి కొంతకాలానికి ఓలక్షరూపాయలకి విమానం మీద సంపూర్ణగ్రహచారపు టిక్కెట్టున్నూ దొరుకుతాయనిన్నీ, అప్పుడు జీవరాసులు సశరీరంగా ఈ రేడులోకాలూ పర్యటనం చెయ్యవచ్చుననిన్నీ శాస్త్రజ్ఞులు నమ్ముతున్నారు.